# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 14-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు దేశ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

❖ భారత్ ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని మారిషస్ విదేశాంగ మంత్రి ధనంజయ్ రామ్‌ఫుల్ పేర్కొన్నారు.

❖ వికసిత్ భారత్ దార్శనికతను సాకారం చేసుకోవడానికి ఈశాన్య ప్రాంతం కీలకమైన చోదక శక్తి అని కేంద్రసహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

❖ తమిళనాడు రాష్ట్ర బడ్జెట్ పత్రాల్లో రూపాయి గుర్తును (₹) తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు

=========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు దేశ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ భారత విలువైన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నం అని ఐక్యత, ప్రేమ, సామరస్యం యొక్క సందేశాన్ని ఇస్తుందని రాష్ట్రపతి సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. భారత మాత పిల్లలందరి జీవితాలను నిరంతర పురోగతి, శ్రేయస్సు ఆనందం రంగులతో నింపడానికి ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ హోలీ చెడుపై మంచి విజయం అని, వసంత రాకను సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హోలీ పండుగ దేశ ప్రజలలో ఐక్యతను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యం లో దేశం ముందుకు వెళ్తుందని కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో హోలీ వేడులకల అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశం ఆర్థికంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందన్నారు. దేశ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ....

(వాయిస్ 20 సెకన్లు)

=========================

దేశ ప్రజలంతా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఐక్యంగా ఉంటే ప్రపంచంలోని ఏ శక్తీ దేశాభివృద్ధి ఆపలేదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు. ఈరోజు గోరఖ్‌పూర్‌లో ప్రజల మధ్య హోలీ పండుగను ఆయన ఎంతో ఉత్సాహంగా జరుపుకొన్నారు. గోరఖ్‌నాథ్ ఆలయ సముదాయంలోని హోలికా దహన్ స్థలంలో పూజ, హారతి నిర్వహించిన అనంతరం హోలీ వేడుకలను ఆయన ప్రారంభించారు. జాతీయ సమైక్యత అవసరాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావిస్తూ... దేశంపై దండెత్తిన వారు మన విశ్వాసాలను దెబ్బతీసే ప్రయత్నం చేశారని అన్నారు. హోలీ, దీపావళి, మహాకుంభ్ వంటి కార్యక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిని మనం చూశామని, అయినప్పటికీ ఏ ఒక్కరూ సంప్రదాయాలను అడ్డుకోలేకపోయారని అన్నారు.

=========================

భారత్ ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా వేగంగా అభివృద్ధి చెందడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని మారిషస్ విదేశాంగ మంత్రి ధనంజయ్ రామ్‌ఫుల్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రానున్న కాలంలో భారతదేశం శక్తి వంతమైన దేశంగా ఎదుగుతోందని ఉద్ఘాటించారు. రాబోయే సంవత్సరాల్లో అందరి దృష్టి భారతదేశంపైనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

=========================

తమిళనాడు రాష్ట్ర బడ్జెట్ పత్రాల్లో రూపాయి గుర్తును (₹) తొలగించిన వ్యవహారంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ ఆ గుర్తుతో ఇబ్బంది ఉంటే.. 2010లో దాన్ని కేంద్రం అధికారికంగా ఆమోదించిన సమయంలో ఎందుకు వ్యతిరేకించలేదని డీఎంకేను 'ఎక్స్' వేదికగా ఆమె ప్రశ్నించారు. యూపీఐ సేవలను అంతర్జాతీయం చేసేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోన్న సమయంలో సొంత కరెన్సీ చిహ్నాన్ని బలహీనపరచడం భావ్యం కాదని ఆమె పేర్కొన్నారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను నిలబెడతామని రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేస్తారని.. అయితే, ఈ చిహ్నాన్ని తొలగించడం ఆ ప్రమాణానికే విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఇది జాతీయ ఐక్యత పట్ల వారి నిబద్ధతను దెబ్బతీస్తుందని నిర్మలా సీతారామన్ తెలిపారు.

=========================

బ్యాంకు ఉద్యోగులు ఈ నెల 24, 25 తేదీల్లో సమ్మెకు దిగనున్నారు. ఈ రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్ ఆఫ్ బియూ) తెలిపింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్- ఐబీఏతో జరిగిన చర్చలు ఎటువంటి సానుకూల ఫలితాన్ని ఇవ్వకపోవడం వల్ల యూఎఫ్బీయూ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

విరామం

=========================

తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమాల్‌లోని నిలువురాళ్లకు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా తాత్కాలిక జాబితాలో చోటు దక్కింది. పారిస్‌లోని యునెస్కో భారతదేశ శాశ్వత ప్రతినిధి బృందానికి ఈ సమాచారం ఇచ్చింది. అశోక శాసన ప్రదేశాలు, 64 యోగిని దేవాలయాలు సహా భారత్‌లోని ఆరు వారసత్వ ప్రదేశాలు యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించినట్లు బృందం పేర్కొంది. తాత్కాలిక జాబితాలో చేర్చబడిన ప్రదేశాల్లో ఛత్తీస్‌గఢ్‌లోని కంగేర్ వ్యాలీ నేషనల్ పార్క్, తెలంగాణలోని

ముడుమాల్ మెగాలిథిక్ మెన్హిర్, పలు రాష్ట్రాల్లో నిర్మించిన అశోక శాసన ప్రదేశాలు, చౌసత్ యోగిని దేవాలయాలు, ఉత్తర భారతదేశంలోని గుప్త దేవాలయాలు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోని బుందేలాస్ రాజభవనాలు, కోటలు ఉన్నాయి.

========================

వికసిత్ భారత్ దార్శనికతను సాకారం చేసుకోవడానికి ఈశాన్య ప్రాంతం కీలకమైన చోదక శక్తి అని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. ఈరోజు షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ సెంటర్ ఫర్ టెక్నాలజీ అప్లికేషన్ అండ్ రీచ్ నూతన శాశ్వత క్యాంపస్‌కు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలో కుంకుమ పువ్వు సాగుకు ఈశాన్య ప్రాంతం ప్రధానం కానుందని పేర్కొన్నారు. ప్రస్తుతం అరుణాచల్ ప్రదేశ్‌లోని మెంచుఖా సిక్కింలోని యుక్సోమ్‌లలో పెద్ద ఎత్తున ఈ సాగు జరుగుతోందని తెలిపారు. అలాగే నాగాలాండ్ మణిపూర్‌లకు విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని అన్నారు. ఇది ఉన్న పంటలకు అంతరాయం కలిగించకుండా వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచుతుందని తెలియజేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

========================

అమెరికాలో జరిగిన ఒక విమాన ప్రమాదంలో 12 మందికి గాయాలయ్యాయి. కొలరాడో రాష్ట్రంలో ఉన్న డెన్వర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక విమానంలో ల్యాండ్ అయిన వెంటనే మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక బృందాలు రంగంలోకి దిగి విమానంలోని 172 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అందులో స్వల్ప గాయాలైన 12 మందిని వివిధ ఆసుపత్రులకు తరలించినట్లు డెన్వర్ విమానాశ్రయం అధికారులు ఎక్స్ వేదికగా తెలిపారు.

========================

కేంద్రపాలిత ప్రాంతమైన లడఖ్‌తో పాటు జమ్ము-కశ్మీర్‌లో భూమి కంపించింది. హోలీ రోజున తెల్లవారు జామున 2 గంటల 50 నిమిషాలకు లడఖ్‌లోని కార్గిల్‌లో 5.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ ప్రకంపనలు జమ్ముకశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలలోనూ కనిపించాయి. భూకంప కేంద్రం 15 కిలోమీటర్ల లోతులో ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది.

========================

ఆకాశంలో ఈరోజు సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ సంవత్సరంలో మొదటి గ్రహణం.. అందులో సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడింది. అరుదైన బ్లడ్ మూన్ ఘట్టం చోటు చేసుకోవడంతో ప్రపంచమంతా ఈ దృశ్యాన్ని చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. సుదీర్ఘ విరామం తర్వాత 'బ్లడ్ మూన్'గా పిలిచే చంద్రగ్రహణం ఏర్పడిందని, దీని ప్రకారం భూమి నీడ జాబిల్లిని 99.1 శాతం కప్పేస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. భారత కాలమానం ప్రకారం ఉదయం 11 గంటల 57 నిమిషాలకుగ్రహణం మొదలై... మధ్యాహ్నం 12 గంటల 29 నిమిషాల వరకూ కొనసాగింది. అయితే.. ఆ సంపూర్ణ చంద్రగ్రహణం పశ్చిమార్ధగోళంలో పూర్తిగా, కొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా కనిపించింది. ఉత్తర-దక్షిణ అమెరికా దేశాలు, పశ్చిమ ఐరోపా దేశాలు, ఆఫ్రికా దేశాల్లోని వారు ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించారు. ప్రత్యేకించి.. అమెరికాలో ఎక్కువ ప్రాంతాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం స్పష్టంగా కనిపించింది.

========================

========================